సాక్షి ఒడిశా

ఆదివారం । 4 । ఆగస్టు । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.5,57,014
బంగారం	3 గ్రాముల 150 మిల్లీ గ్రాములు
వెండి	44 గ్రాములు


- భువనేశ్వర్/పూరీ

డీజీపీగా యోగేష్ బహదూర్..?



రాష్ట్ర తదుపరి డీజీపీగా 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి యోగేష్ బహదూర్ ఖురానియా నియమితులయ్యే అవకాశం ఉంది.

- 8లో



రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- 8లో

గంజాం జిల్లా ఖల్లికోట ప్రాంతం 16వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న దుర్ఘటనలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు.

న్యూస్‌రీల్

సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాశాఖ అధికారి సుదీప్త్

రాయగడ: స్థానిక గాయత్రీ నగర్‌లోని సరస్వతీ శిశు విద్యా మందిర్‌లో సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన శనివారం నిర్వహించారు. విద్యార్థులు తమ ప్రతిభకు పదునుపెట్టి వివిధ అంశాలను ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సమితి విద్యాశాఖ అధికారి సుదీప్త్ కుమార్ దాస్ హాజరై విద్యార్థులు ప్రదర్శనలో ఉంచిన ప్రాజెక్టులను తిలకించారు. వివిధ అంశాలకు చెందిన 105 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విద్యా మందిర్ పరిచాలన కమిటీ అధ్యక్షుడు హరిశ్చంద్ర దాస్, కోశాధికారి సంజీవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహేంద్రగిరుల అభివృద్ధికి కృషి

- మంత్రి బిభూతి భూషణ్ జెన్నా



మాట్లాడుతున్న రవాణా శాఖ మంత్రి బిభూతీ భూషణ్ జెన్నా తదితరులు

పర్లాకిమిడి: మహేంద్రగిరి పర్వతాలను కేంద్ర పర్యాటక శాఖతో మాట్లాడి ఉన్నతంగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర గనులు, రవాణా శాఖ మంత్రి బిభూతీ భూషణ్ జెన్నా తెలిపారు. శనివారం కోయిపూర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మహేంద్రగిరి పర్వతాలను సందర్శించారు. అనంతరం మోహనా ఎమ్మెల్యే దాశరథి గొమాంగో మాట్లాడుతూ.. విశిష్ట చారిత్రాత్మక సందర్శన స్థలం మహేంద్రగిరి పర్వతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి నిధులు మంజూరు చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. వారితో పాటు ఎమ్మెల్యేలు మనోరంజన్ ధ్యాన్ సామంతరాయ్, దుష్మంత స్వయిని, రాయఘడ సమితి చైర్మన్ పూర్ణబాసి నాయక్, మాజీ చైర్మన్ అంతర్యామి గొమంగో, బీజేపీ యువజన విభాగ అధ్యక్షుడు బాలకృష్ణ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

బెంగుళూర్‌లో ఒడిశా వాసి మృతి



గ్రామానికి చేరిన శంబునాథ్ మృతదేహం

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి నాయక్‌గూడ పంచాయతీ చలాన్‌గూడ గ్రామానికి చెందిన శంబునాథ్ పంగి (28) బెంగుళూర్‌లో వలస కూలీగా పని చేస్తున్నాడు. అతడికి గత వారం జ్వరం రావడంతో తనతో పనిచేస్తున్న కూలీలు సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ అతడు మరణించారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. అక్కడి నుంచి మృతదేహాన్ని తీసుకురావడానికి సామాజిక కార్యకర్త వినోద్ టావారి రూ.20 వేల సాయం అందజేశారు. శనివారం సాయంత్రం శంబు మృతదేహం స్వస్థలానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.

భార్యను కడతేర్చిన భర్త

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖోయిర్‌పూట్ సమితి ముదిలిపోడ పంచాయతీ మందుగూడ గ్రామంలో దారుణం చోటుచేసుకుంది. మందు లేదని చెప్పడంతో భార్యను భర్త కడతేర్చిన ఘటన జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన లచీమ్ దంగిడిమాఝి తన స్నేహితుడిని శుక్రవారం రాత్రి ఇంటికి భోజనానికి తీసుకొచ్చాడు. ఈ సందర్భంగా ఇంట్లో మద్యం ఉంటుందని, దానిని ఇవ్వమని భార్య బుదయి దంగడిమాఝి (36)కి అడిగాడు. కాగా ఉదయమే ఇంట్లో ఉన్నటువంటి మద్యం తాగేశావని, ప్రస్తుతం ఇంట్లో మరేమీ లేదని సమాధానం చెప్పింది. దీంతో అతను కోపోద్రేక్తుడై స్నేహితుడి ముందు పరువు తీసిందని సమీపంలో ఉన్న కత్తితో ఆమెను పొడిచాడు. ఆమె బాధతో కేకలు వేస్తూ కిందపడిపోయింది. ఇరుగుపొరుగువారు వచ్చి చూడగా అప్పటికే ఆమె మరణించింది. వెంటనే ముదిలిపోడ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి లచీమ్ దంగిడిమాఝిని అరెస్టు చేశారు. మృతదేహాన్ని ఖోయిర్‌పూట్ ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



గంజాం జిల్లా బీజేడీ నాయకులతో నవీన్ పట్నాయక్ సమావేశం

ఎత్తుకు పైఎత్తులు..!



- రాష్ట్రంలో బీజేడీ పతనానికి బీజేపీ వ్యూహం
- ప్రజల్లో మద్దతుకు బీజేడీ ప్రతివ్యూహం
- అసెంబ్లీలో రసవత్తరంగా ఇరుపక్షాల మాటల యుద్ధం

భువనేశ్వర్: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు విభిన్న దిశలో మలుపులు తిరుగుతున్నాయి. ప్రధానంగా అధికార, విపక్షాల హోదాలు తారుమారు కావడంతో ఒకరి పక్కలో బల్లెంగా మరొకరు వ్యవహరిస్తున్నారు. ఒకవైపు ప్రజల్లో మరలా మద్దతుకు బీజేడీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. మరోవైపు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులను అనుకూలంగా మలచుకుని మరింత పట్టు సాధించే దృక్పథంతో జాతీయ స్థాయిలో భారతీయ జనతా పార్టీ శ్రేణులు రెప్ప వేయకుండా నిగూఢంగా పరిశీలిస్తున్నాయి. విపక్ష హోదాలో రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం సరికొత్త పంథాలో పోరాడుదామని విపక్ష నేత నవీన్ పట్నాయక్ పిలుపునిచ్చి బీజేడీ వర్గీయులను ఉత్సాహపరుస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఉభయ పార్టీల నుంచి ఫిరాయింపు జెండా ఊపి గూడు మార్చుకున్న ఫిరాయింపుదారులు బీజేపీ, బీజేడీకి లోపాయికారీ నిఘా వనరుగా దోహదపడుతున్నారు. వెన్నుపోటు, ఎదురు దాడి వ్యూహాలతో విపక్ష బీజేడీ పతనానికి బీజేపీ కంకణం కట్టుకుందనే అభిప్రాయం రాజకీయ శిబిరాల్లో చర్చనీయాంశమైంది. బీజేడీ నుంచి రాజ్యసభలో రాష్ట్రానికి ప్రాతినిథ్యం వహించిన మమతా మహంతొ ఇటీవల రాజ్యసభ సభ్యత్వంతో పాటు బీజేడీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి అధికార పక్షం బీజేపీలో చేరడం దీనికి తార్కాణంగా పేర్కొంటున్నారు.

ప్రజాబలంతో ముందుకు సాగుతాం

ఊహాతీతంగా సార్వత్రిక ఎన్నికల తుది ఫలితాల్లో అధికార హోదా కోల్పోయిన బిజూ జనతా దళ్ తిరిగి ప్రజాదరణ పొందేందుకు క్షేత్రస్థాయిలో సన్నాహాలు ప్రారంభించింది. ఈ దిశలో ప్రాంతీయ బీజేడీ కార్యకర్తలతో ప్రత్యక్ష సంప్రదింపులకు అధినేత నవీన్ పట్నాయక్ నడుం బిగించారు. జిల్లాల వారీగా పార్టీ కార్యకర్తలతో తరచూ సమావేశం అవుతున్నారు. అవిభాజిత గంజాం జిల్లా బిజూ జనతా దళ్‌కు కంచుకోట. ఈసారి ఎన్నికల్లో ఈ ప్రాంతంలో కూడ ఫలితాలు సానుకూలంగా రాలేదు. దీంతో బీజేడీ పునరుద్ధరణ కార్యకలాపాలను గంజాం జిల్లా నుంచి చేపట్టేందుకు అధినేత నిర్ణయించారు. ఈ కార్యాచరణకు సార్వత్రిక ఎన్నికలకు ముందు బీజేపీ నుంచి బీజేడీలో చేరిన భృగు బక్షిపాత్రొ కీలక పాత్రధారిగా వ్యవహరించనున్నట్లు తెలుస్తుంది.

గంజాం జిల్లా నాయకులతో సమావేశం

ఈ నేపథ్యంలో బిజూ జనతా దళ్ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ గత ఎన్నికల్లో శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో సమావేశమయ్యారు. దీనిలో భాగంగా బీజేడీ భవిష్యత్తు కోసం వ్యూహ రచనకు శ్రీకారం చుట్టారు. నవీన్ నివాస్‌లో శనివారం ఈ సమావేశం జరిగింది. జిల్లా ప్రముఖుల సంప్రదింపుల ఆధారంగా త్వరలో గంజాం జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. బరంపురం మేయర్ మరియు గంజాం జిల్లా బీజేడీ ముందంజ సంస్థలు, వర్గాల ప్రముఖులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అంతకుముందు బిజూ జనతా దళ్ సీనియర్ నాయకుడు దేవీ ప్రసన్న మిశ్రా అధ్యక్షతన స్థానిక శంఖ భవన్‌లో గంజాం జిల్లాలో అన్ని శాఖల బిజూ జనతా దళ్ నాయకులతో సమావేశమయ్యారు.

పథకాలపై ప్రతిపక్షం మండిపాటు

బీజేడీ ప్రభుత్వ పథకాల పేర్లు మార్చి సరికొత్త పథకాలుగా బడ్జెటులో ప్రవేశపెట్టి అమాయక ప్రజలను బురిడీ కొట్టించారనే విపక్ష నేత నవీన్ పట్నాయక్ విశ్లేషణ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. ప్రధానంగా ఒడియా ఆత్మ గౌరవం, ఉచిత విద్యుత్ వంటి ప్రముఖ ఎన్నికల హామీలపై విపక్ష నేత వ్యాఖ్యలను సభలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి దాటవేత వైఖరితో పబ్బం గడుపుకున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం ఊపందుకుంది. ఈ ప్రభుత్వం ప్రజా బడ్జెటుని ఆవిష్కరించిందని ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి పూర్తి ఆత్మ విశ్వాసంతో సభలో ప్రకటించారు. అధికారంలో కొనసాగుతూ ప్రజాదరణ పొందేందుకు తనదైన శైలిలో సాధారణ ప్రజానీకం మధ్య ప్రత్యక్షం అవుతున్నారు.

దుస్తులు ఆరబెడుతుండగా విద్యుత్ షాక్

- తల్లీ, కుమారుడు దుర్మరణం





దుర్యోధన అమనాత్య(ఫైల్) రమా అమనాత్య



ఆస్పత్రిలో విలపిస్తున్న కుటుంబ సభ్యులు

జయపురం: విద్యుత్ షాక్‌తో తల్లీ, కొడుకు దుర్మరణం చెందిన ఘటన జయపురం సబ్ డివిజన్ బొరిగుమ్మ పోలీసుస్టేషన్ పరిధి జయపురం సమితి జయంతిగిరి తొలగుడ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన దుర్యోధన అమనాత్య (35) శుక్రవారం స్నానంచేసి తడి దుస్తులను తన ఇంటి ముందు దుస్తులు ఆరబెట్టేందుకు కట్టిన వైరుపై వేశాడు. దీంతో వెంటనే అతడు విద్యుత్ షాక్‌కు గురై కిందపడ్డాడు. అతడి ఆక్రందనలు విన్న తల్లి రమా అమనాత్య(62) పరుగున ఇంట్లో నుంచి వచ్చింది. కిందపడిన కొడుకును రక్షించే ప్రయత్నంలో ఆమెకు కూడా విద్యుత్ షాక్ తగలింది. దీంతో వెంటనే దీనిని గమనించిన దుర్యోధన భార్య నవీన, అత్త సునాదేయి వారిని రక్షించే ప్రయత్నం చేయగా వారు కూడా విద్యుదాఘాతానికి గురైయ్యారు. ఇది చూసిన చుట్టుపక్కలవారు తక్షణమే విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. అనంతరం విద్యుత్ షాక్‌కు గురైనవారిని ఫూల్‌బెడ ప్రాంతంలోని జిల్లాకేంద్ర ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారిని పరీక్షించిన డాక్టర్లు దుర్యోధన, అతని తల్లి రమా అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు. మిగతా ఇద్దరు ప్రాథమిక చికిత్సతో బయటపడ్డారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. దుర్యోధన అమాత్యకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. అందువలన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. బొరిగుమ్మ పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. సమాచారం అందుకున్న జయపురం తహసీల్దార్ డా.మనోలిస ఆచారి, బొరిగుమ్మ తహసీల్దార్ అమృత లాల్ బెహర, జయంతిగిరి రెవెన్యూ సూపరింటెండెంట్ దిలీప్ కుమార్ సామంతరాయ్‌లు దర్యాప్తు జరిపారు. అనంతరం బాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ నిధి నుంచి రూ.20 వేలు అందించారు. ఇంటికి ఉన్న సర్వీస్ కనెక్షన్‌తో బట్టలు ఆరబెట్టేదుకు కట్టిన జీఐ వైరు తగిలి ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు భావిస్తున్నారు.

కళింగ స్టేడియం సందర్శన



క్రీడాకారులతో మాట్లాడుతున్న సీఎం మోహన్‌చరణ్ మాఝీ

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ శనివారం ఉదయం మార్నింగ్ వాక్ సందర్భంగా స్థానిక కళింగ స్టేడియాన్ని సందర్శించారు. ఈ సముదాయంలో క్రీడాకారులు, శిక్షణార్థులకు అందుబాటులో ఉన్న పలు సౌకర్యాలపై చర్చించి, స్టేడియంలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

నేడు శ్రీక్షేత్రంలో లలాట అమావాస్య

- జగన్నాథుడికి వజ్రాభరణం అలంకరణ



బలభద్ర స్వామి నీలి రత్నం బాసికం



శ్రీజగన్నాథుని లలాట ఆభరణం

భువనేశ్వర్: శ్రీజగన్నాథుడు శోభాయమానుడు. శ్రీమందిరం రత్న వేదికపై ఆసీనుడైన స్వామి లలాటంపై వజ్రాభరణం తళుక్కుమంటుంది. ఈ ఆభరణ అలంకరణ వేడుకని శ్రీక్షేత్రంలో లలాట అమావాస్యగా శోభాయమానంగా నిర్వహిస్తారు. ఏటా శ్రావణ మాసం కృష్ణ పక్ష అమావాస్య తిథి పురస్కరించుకుని స్వామివారి సన్నిధిలో ఈ వేడుక నిర్వహిస్తారు. ఆదివారం ఈ వేడుక పరంపర ప్రకారం ఆనందోత్సాహాలతో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. చిత్తా లగ్గి (లలాట అలంకరణ) అమావాస్య లేదా చిత్తవ్ ఉత్సవంగా ఏటా జరుగుతుంది.

చిత్తా లగ్గి అమావాస్యగా ప్రాచుర్యం

శ్రావణ అమావాస్య రోజున రత్న వేదికపై కొలువు దీరిన శ్రీజగన్నాథుడు, బలభద్రుడు మరియు దేవీ సుభద్ర (దేవతా త్రయం) నుదుట ప్రత్యేక ఆభరణం (బాసికం) అలంకరిస్తారు. ఆలయ రీతి రివాజు ప్రకారం ఈ ఉత్సవం నిర్వహించడం విశేషం. శ్రీమందిరంలో రోజువారీ నిత్య పూజలు మరియు ధూపదీపాలు, తొలి భోగం నివేదన తర్వాత లలాట అమావాస్య ఉత్సవం కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఈ ఆచరణతో రాష్ట్రంలో శ్రావణ మాసం కృష్ణపక్ష అమావాస్య చిత్తా లగ్గి అమావాస్యగా ప్రాచుర్యం పొందింది.

భారీ స్నానంతో తొలగించి

ఏటా జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని తొలిసారిగా శ్రీమందిరం రత్న వేదికపై మూల విరాటులు ఆలయ ప్రహరి మేఘనాథ్ ప్రాంగణంలో బహిరంగ స్నాన మండపానికి తరలి వస్తాయి. ఈ మండపంపై స్వామి స్నాన పర్వం అంగరంగ వైభవంగా జరుగుతుంది. ఈ సందర్భంగా మూల విరాటుల నుదుట అలంకరించిన బాసికాలు తొలగిస్తారు. అనంతరం భారీ స్నానంతో స్వామి అస్వస్థతకు లోనవ్వడంతో ధవళ వస్త్రధారిగా కనుమరుగున గోప్య సేవలు అందుకుని కోలుకోవడంతో నవ దినాత్మక యాత్రకు బయల్దేరి, నీలాద్రి విజే నాడు తిరిగి శ్రీమందిరం రత్న వేదికకు చేరుతాడు. స్నానం పురస్కరించుకుని తొలగించిన లలాట ఆభరణాన్ని శ్రావణ మాసం కృష్ణ పక్ష అమావాస్య నాడు తిరిగి దేవతాత్రయం లలాటంపై ఆభరణం అలంకరిస్తారు. శ్రీజగన్నాథుని లలాటంపై వజ్రం పొదిగిన తెల్లని బాసికం, బలభద్ర స్వామి నుదుట నీలి రంగు రత్నం పొదిగిన బాసికం, దేవీ సుభద్ర నుదుట ఎర్రని మాణిక్యం పొదిగిన బాసికం అలంకరిస్తారు. తదుపరి జ్యేష్ఠ పౌర్ణమి వరకు మూల విరాటుల నుదుట ఈ ఆభరణం నిత్య శోభాయమానంగా తళుక్కుమంటుంది. ఆలయ ఆచారాల ప్రకారం పతిమహాపాత్రో వర్గం సేవాయతులు ఆభరణం సంస్కార ప్రక్రియ నిర్వహించి దైతపతి సేవకులకు అందజేయడంతో మూల విరాటుల నుదుట అలంకరిస్తారు.

దర్శనం నిలిపివేత

ఆదివారం మూల విరాటులకు చిత్తా లగ్గి ఉత్సవం నిర్వహిస్తారు. నిత్య పూజాదులతో తొలి భోగ మండపం సేవ ముగిసిన తర్వాత ఈ తంతు ప్రారంభిస్తారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సుమారు సాయంత్రం 6 గంటల వరకు ఈ వేడుక కొనసాగుతుంది. శ్రీ మందిరం గర్భ గుడిలో గోప్యంగా నిర్వహించడంతో సాధారణ భక్తుల ప్రవేశం నివారిస్తారు. రత్న వేదికపై దేవతాత్రయానికి లలాట ఆభరణ అలంకరణ పూర్తయ్యేంత వరకు సాధారణ వర్గాలకు సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపివేస్తారు.

ఒక్కొక్కటిగా హామీలు నెరవేరుస్తున్నాం

- రాష్ట్ర అభివృద్ధే మా ధ్యేయం
- పరిశ్రమల ఏర్పాటుతో ప్రగతి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సామల్



మాట్లాడుతున్న మన్మోహన్ సామల్ పక్కనే శివపట్నాయక్, కెరకెట తదితరులు

రాయగడ: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక ఒకొక్కటిగా నెరవేరుస్తున్నామని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అన్నారు. శనివారం రాయగడలో పర్యటించిన ఆయన సెరిగుడలోని బీజేపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. గత రెండు దశాబ్దాలుకు పైగా రాష్ట్రాన్ని పాలించిన బీజేడీని కాదని, ఎంతో నమ్మకంతో ప్రజలు బీజేపీకి పట్టంగట్టారని తెలియజేశారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామన్నారు. ముఖ్యంగా రైతులకు అండగా నిలిచేందుకు ధాన్యం మద్దతు ధరను రూ.3,100లకు పెంచడం, పూరీ రత్నభాండాగారం తెరవడం, ప్రజల దర్శన సౌకర్యార్థం నాలుగు ద్వారాలు తెరవడం వంటి హామీలను నెరవేర్చేందుకు శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. మిగతా హామీలు సైతం అమలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

అందరినీ ఆకర్షించే బడ్జెట్

రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఇటీవల బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరినీ ఆకర్షించేవిధంగా ఉందని సామల్ అన్నారు. ఇది ప్రజల ప్రభుత్వమని, వారి సంక్షేమమే ధ్యేయంగా భావించి అందుకు అనుగుణంగా బడ్జెట్‌ను రూపొందించిందన్నారు. అన్ని వర్గాల వారికి తగిన న్యాయం చేసేవిధంగా ఉన్న బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ ప్రశంసిస్తున్నారని పేర్కొన్నారు.

కొత్త పరిశ్రమలకు స్వాగతిస్తాం

రాష్ట్రంలో అపారంగా ఉన్న ఖనిజ, ప్రాకృతిక సంపదలను సద్వినియోగపరిస్తే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించవచ్చనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందన్నారు. కొత్త పరిశ్రమల ఏర్పాటు ఎంతో అవసరమని, అందుకు ముందుకు వచ్చిన పరిశ్రమలను తమ ప్రభుత్వం స్వాగతిస్తుందని తెలియజేశారు. పరిశ్రమల ఏర్పాటుతో ప్రగతి సాధించడంతో పాటు ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఇక్కడే ఉపాధి అవకాశాలు లభిస్తే వలసలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సాగునీటికి ప్రణాళికలు

రాష్ట్రంలోని రైతన్నలు ఆర్థికంగా ఎదగాలంటే వారి పంట పొలాలకు సాగునీరు అందాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతమున్న సాగునీటి వనరులను నూరుశాతం సద్వినియోగపరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపారు. అదే విధంగా పంటలు పండించే రైతులకు అనుకూలంగా ప్రతీ సమితిలో శీతల గిడ్డంగులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వెల్లడించారు. తొలి విడతగా రాష్ట్రంలో 58 శీతల గిడ్డంగులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు.

విద్యా వ్యవస్థలో మార్పులు

విద్యా వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి, వారి భవిష్యత్ బంగారు బాటలో నడిచేలా చేస్తామన్నారు. త్వరలో రాష్ట్రంలో 16 వేల మంది ఉపాధ్యాయులను నియమించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని వివరించారు. అదేవిధంగా వైద్య రంగంలోనూ మార్పులు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలల ఏర్పాటు విషయమై సమాలోచనలో ఉందన్నారు.

30 లక్షల ఇళ్లు నిర్మిస్తాం

రాష్ట్రంలోని నిరుపేదలకు గూడు కల్పించే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఈ ఏడాది 30 లక్షల ఇళ్లను నిర్మించి అర్హులైన నిరుపేదలకు అందివ్వనున్నదన్నారు. ఇప్పటికీ ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కొన్ని జిల్లాల్లో సరిగ్గా అమలు కావడం లేదని, అర్హులైనవారికి ఆ పథకం ఆమడ దూరంలో ఉందనే విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పేదలందరికి ఆ పథకం సక్రమంగా అందేలా చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

మెగా తాగునీటి ప్రాజెక్టులు

రాయగడ జిల్లాలో ముఖ్యంగా కాసీపూర్ వంటి ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీటిని అందించగలిగితే, ఆ వ్యాధుల సంఖ్య తగ్గుముఖం పడుతుందని భావించి మెగా తాగునీటి ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తామన్నారు. సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి పూర్ణిమీ కెరకెటా, జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, రాష్ట్ర ఎస్టీ, ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బసంత కుమార్ ఉలక, పార్టీ సీనియర్ నాయకుడు టుటు దాస్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

డీజీపీగా యోగేష్ బహదూర్..?



యోగేష్ బహదూర్ ఖురానియా

భువనేశ్వర్: రాష్ట్ర తదుపరి డీజీపీగా 1990 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి యోగేష్ బహదూర్ ఖురానియా నియమితులయ్యే అవకాశం ఉంది. తక్షణమే అమల్లోకి వచ్చేలా ఆయనను డిప్యుటేషన్ నుంచి తొలగించి ఒడిశాకు తిరిగి రావడానికి హోం వ్యవహారాల శాఖ ఆమోదం తెలిపింది. యోగేష్ బహదూర్ ఖురానియా ప్రస్తుతం న్యూఢిల్లీలోని సరిహద్దు రక్షణ దళం (బీఎస్ఎఫ్) ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక డీజీగా కొనసాగుతున్నారు. ఇంతకుముందు అతను న్యూఢిల్లీలోని బీఎస్ఎఫ్ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేక డైరెక్టర్ జనరల్ (ఆపరేషన్స్)గా పని చేశారు. లోగడ ఆయన రాష్ట్రంలో నయాగఢ్, జాజ్‌పూర్, రౌర్కెలా, మయూర్‌భంజ్ మరియు గంజాం జిల్లాలకు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా పని చేశారు. దక్షిణ రేంజ్, ఉత్తర శ్రేణి డీఐజీ, అదనపు పోలీసు కమిషనర్, భువనేశ్వర్ కటక్ పోలీసు కమిషనర్‌గా పని చేశారు. బీపీఎస్పీఏ కమ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ శిక్షణ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు.

అమృత్ మోహన్ ప్రసాద్ బదిలీ



అమృత్ మోహన్ ప్రసాద్

భువనేశ్వర్: ప్రస్తుతం రాష్ట్ర డైరెక్టర్ జనరల్ (కారాగారాలు)గా బాధ్యతలు నిర్వహిస్తున్న 1989 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అమృత్ మోహన్ ప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ స్పెషల్ డైరెక్టర్ జనరల్‌గా నియమితులయ్యారు. వచ్చే ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యేంత వరకు ఈ హోదాలో కొనసాగుతారు.

6 రూట్లలో లక్ష్మీ ఏసీ బస్సులు బంద్



లక్ష్మీ ఏసీ బస్సులు

మల్కన్‌గిరి: జిల్లాలోని 6 రూట్లలో నడుస్తున్న లక్ష్మీ ఏసీ బస్సులను ఈనెల 1వ తేదీ నుంచి నిలిపివేశారు. గతేడాది అక్టోబర్‌లో మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ చేతులమీదుగా మల్కన్‌గిరి నుంచే లక్ష్మీ బస్సులు ప్రారంభించారు. అయితే ప్రస్తుతం వచ్చిన కొత్త ప్రభుత్వం ఏసీ బస్సులను రద్దు చేసింది. కాగా సాధారణ లక్ష్మీ బస్సులు యథావిధిగా నడుస్తాయని అధికారి బిభు ప్రసాద్ త్రిపాఠి తెలియజేశారు.

గుమడలో ఎస్‌బీఐ సేవలు ప్రారంభం



ఎస్‌బీఐ శాఖను ప్రారంభిస్తున్న దృశ్యం

రాయగడ: గుణుపూర్ సబ్ డివిజన్‌లోని గుమడలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) శాఖ ప్రారంభమైంది. ఎస్‌బీఐ భువనేశ్వర్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ పి.దినేష్ ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ డీజీఎం సోన్‌దీప్ కుమార్ చౌబే (బరంపురం), రాయగడ రీజనల్ మేనేజర్ ప్రకాష్ కుమార్ నాగ్ తదితరులు పాల్గొన్నారు.

లారీ-టిప్పర్ ఢీ



స్తంభించిన ట్రాఫిక్

శ్రీకాకుళం రూరల్: రాగోలు మీదుగా వాకలవలసకు వెళ్లే రోడ్డులో శనివారం స్వల్ప ప్రమాదం చోటుచేసుకుంది. వాకలవలస జంక్షన్ వద్ద శ్రీకాకుళం నుంచి వస్తున్న డీసీఎం లారీ ఆమదాలవలస నుంచి వస్తున్న టిప్పర్ ఒకదానికి ఒకటి ఎదురెదురుగా ఢీకొట్టాయి. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. దీంతో ఒక్కసారిగా రెండు కిలోమీటర్లు మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ పోలీసులు, రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.

కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలి



కార్యకర్తల సమావేశంలో మన్మోహన్ సామల్, కెరకెట తదితరులు



సమావేశంలో పాల్గొన్న బీజేపీ కార్యకర్తలు

• బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మన్మోహన్ సామల్

రాయగడ: జిల్లాలో బీజేపీ బలపడడానికి కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ అన్నారు. ఒక్కరోజు పర్యటనకు రాయగడ విచ్చేసిన ఆయన స్థానిక సెరిగుడలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. గత ఎన్నికల్లో ఈ జిల్లాలోని మూడు శాసనసభ స్థానాలు, కొరాపుట్ లోక్‌సభ స్థానంలో పార్టీ పరాజయం పొందడంపై ప్రస్తావించారు. రాష్ట్రంలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఉందని, కార్యకర్తలు ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. ప్రజల వద్దకు పార్టీ చేరితే వారి ఆదరణ లభిస్తుందన్నారు. పార్టీలో వ్యక్తిగత కక్షలకు తావివ్వకుండా ఇప్పటినుంచే ఒక క్రమ పద్ధతిలో పనిచేస్తే రానున్న పంచాయతీ, మున్సిపాలిటీ ఎన్నికల్లో పార్టీ స్థిరపడుతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే ప్రతీ సంక్షేమ పథకం సక్రమంగా ప్రజల చెంతకు చేరేలా కార్యకర్తలు తమ తమ పరిధుల్లో పనిచేయాల్సి ఉంటుందన్నారు. అదేవిధంగా పథకాల గురించి ప్రజలకు అవగాహన కలిగేలా కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పార్టీ పటిష్టంగా ఉండాలంటే అందుకు సమర్థవంతమైన నాయకత్వం ఉండాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర శాఖ సాధారణ కార్యదర్శి పూరిమ కెరకెటా మాట్లాడుతూ మహిళలు రాజకీయ రంగంలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. మహిళలకు ఎంతో ప్రాధాన్యత కల్పిస్తుండడంతో రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ లభించిందని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విజి'లెన్స్'



సుధాంశు శేఖర్ రాణా

భువనేశ్వర్: సోన్‌పూర్ జిల్లా ఉలుందా మండల భూసార పరిరక్షణ పర్యవేక్షకుడు సుధాంశు శేఖర్ రాణా ఒడిశా విజిలెన్స్ వలలో శనివారం చిక్కుకున్నారు. పతొబాడి చౌక్‌లో ఒక వ్యక్తి నుంచి రూ.11,000 లంచం తీసుకుంటుండగా విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. నిందితుడు సుధాంశు శేఖర్ రాణా ఫామ్ పాండ్ తవ్వకం పథకం కింద పని పూర్తిచేసిన తర్వాత తుది బిల్లును విడుదల చేయడానికి ఒక లబ్ధిదారుడి (ఫిర్యాదుదారు) నుంచి రూ.11,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో ఆయన విజిలెన్స్ అధికారులను సంప్రదించగా, రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం రాణాకు చెందిన 2 వేర్వేరు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు చేశారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు



కెరడ ఆశ్రమ పాఠశాల నిర్వాహకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్యాణి



వత్తాడ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న దృశ్యం



కొట్లాగుడలో విద్యార్థినులతో భోజనం చేస్తున్న సబ్ కలెక్టర్

రాయగడ: సదరు సమితి పరిధిలోని కెరడ, పితామహల్, బొడొరాయిసింగి, వత్తాడ ప్రాంతాల్లో ఆదివాసీ, హరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలను సబ్ కలెక్టర్ కల్యాణి సంఘ మిత్రా దేవి శుక్రవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా అదనపు సంక్షేమ శాఖ అధికారి ప్రశాంత్ కుమార్ బౌరి, ధీరేంద్ర సాహులతో కలిసి ఆమె పరిశీలించారు. కెరడ ఆశ్రమ పాఠశాలకు వెళ్లగా అక్కడ కొంతమంది విద్యార్థులు బయట తిరుగుతుండడం గమనించి నిర్వాహకులపై మండిపడ్డారు. అనుమతులు లేకుండా విద్యార్థులను ఎందుకు బయట తిరగనిస్తున్నారని ప్రశ్నించారు. అనంతరం వసతి గృహానికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రత లేకపోవడంతో నిర్వాహకులను నిలదీశారు. ఇప్పటికే ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అంతంతమాత్రంగా ఉందని, అపరిశుభ్రత ఉంటే విద్యార్థుల ఆరోగ్యాలు దెబ్బతింటాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై అన్ని విషయాల్లో తగు జాగ్రత్తలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం కొట్లాగుడలోని హాస్టల్‌కు వెళ్లి విద్యార్థులతో రాత్రి భోజనం చేశారు. భోజనం విషయంలో నాణ్యత లోపిస్తే చర్యల తప్పవని నిర్వాహకులకు హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం



ఘటనా స్థలంలో బోల్తాపడిన ట్రక్కు

భువనేశ్వర్: గంజాం జిల్లా ఖల్లికోట ప్రాంతం 16వ నంబర్ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న దుర్ఘటనలో ఇద్దరు కావడిదారులు(బోల్ భం భక్తులు), ఒక వృద్ధుడు దుర్మరణం పాలయ్యారు. దిమిరియా గ్రామ సమీపంలో శనివారం ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు కావడిధారులు, ఒక వృద్ధుడిపై నుంచి ట్రక్కు దూసుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే వీరు మృతి చెందారు. ప్రమాదం తర్వాత ట్రక్కు బోల్తా పడింది. సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలం సందర్శించారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభించారు. ఈ ట్రక్కు బరంపురం నుంచి కోల్‌కత్తా వెళ్తున్నట్లు సమాచారం. మరణించిన ఇద్దరు భక్తులు బొఫూర్ ప్రాంతానికి చెందిన పప్పూ నాహక్, రంజీ నాహక్‌లుగా గుర్తించారు. మరో మృతుడు డిమిరియా పంచాయతీ డోలిబాటి గ్రామానికి చెందిన బొనొమాలి పాత్రోగా గుర్తించారు. దీంతో విషాద వాతావరణం నెలకొంది.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు టాస్క్‌ఫోర్స్



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సీఎం మోహన్‌చరణ్

భువనేశ్వర్: కెంజొహర్ జిల్లాలో భారీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ మనోజ్ ఆహుజా నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ పని చేస్తుంది. శనివారం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కెంజొహర్ జిల్లాలో ప్రతిపాదిత ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం పెట్టుబడిదారులతో చర్చలు జరపడానికి ఈ టాస్క్‌ఫోర్స్ ప్రక్రియను వేగవంతం చేస్తుంది. సమావేశంలో పరిశ్రమల శాఖ మంత్రి సంపద్ స్వాంయి, సీనియర్ ఐఏఎస్ అధికారులు పాల్గొన్నారు.

క్యాపిటల్ ఆస్పత్రి సందర్శన



రోగిని పరామర్శిస్తున్న సీఎం మోహన్ చరణ్ మాఝి



ఆస్పత్రిలో సౌకర్యాల కోసం రోగులను అడిగి తెలుసుకుంటున్న సీఎం

భువనేశ్వర్: రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిని శుక్రవారం రాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అయన ఆస్పత్రిలోని రోగులతో మాట్లాడారు. రాత్రిపూట రోగులకు ఎలా సంరక్షణ అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రోగులతో చర్చించిన అనంతరం వారి వసతి, భోజనం, అటెండర్ల సౌకర్యాలపై ఆరా తీశారు. దీంతో పాటు ఆసుపత్రి శానిటరీ వ్యవస్థపై కూడా అవగాహన కల్పించారు. రాజధాని ఆస్పత్రిని ఆధునీకరించి రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. ఆస్పత్రిలో వైద్యులు, ఇతర సిబ్బంది రోగులపై మరింత సున్నితంగా వ్యవహరించాలని సూచించారు. ముఖ్యమంత్రి సందర్శన సందర్భంగా ఆస్పత్రి డైరెక్టర్ డా.దిలీప్ కుమార్ పండా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలోని తాత్కాలిక ఉద్యోగులతోనూ ముఖ్యమంత్రి చర్చించి వారి వేతనాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆమోదం పొందిన తర్వాత కొత్తగా పెరిగిన వేతనాల చెల్లింపు ప్రయోజనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రోగుల సంరక్షణ వంటి గొప్ప కార్యాన్ని దృఢ సంకల్పంతో చేపట్టాలని కోరారు.

అగ్నివీర్ పథకంపై అవగాహన

నరసన్నపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అగ్నివీర్ పథకంపై యువత అవగాహన పెంచుకోవాలని ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రతినిధులు ఎస్.సందీప్, దేవకాంత్ మిశ్రాలు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అగ్నివీర్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ దేశ సేవలో నాలుగేళ్లు పాల్గొనే అవకాశం వస్తుందని, సర్వీసు నుంచి రిటైర్ అయిన వారికి ఏక మొత్తంలో రూ. 7 లక్షలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. అనంతరం వీరికి పోలీస్, పారామిలటరీల్లో రిజర్వేషన్లు కల్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి.లత నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ ఉజ్వల్, జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎ.సుధ తదితరులు మాట్లాడారు.

'ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలి'

ఎచ్చెర్ల క్యాంపస్: బుడగుట్లపాలెం సముద్ర తీరంలో రూ.365 కోట్లతో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. బుడగుట్లపాలెంలో నిర్మిస్తున్న ఫిషింగ్ హార్బర్ పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ, రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పనులు ఎట్టి పరిస్థితుల్లో నిలుపుదల చేయవద్దని సూచించారు. పనుల పురోగతిపై 15 రోజులకోసారి సమీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. భూకేటాయింపులపై రెవెన్యూ అధికారులు పరిస్థితి వివరించారు. పనులు పురోగతిపై రెండు వారాలకు ఒక సారి నివేదిక అందజేయాలని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగయ్య, మత్స్యశాఖ జేడీ పీవీ శ్రీనివాసరావు, ఎచ్చెర్ల, రణస్థలం తహసీల్దార్లు ఎ.సింహాచలం, ఎన్.ప్రసాదరావు, డిప్యూటీ తహసీల్దార్ చక్రవర్తి, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మూగబాలికపై కుక్కల దాడి



కుక్కల దాడిలో గాయపడిన బాలిక

సరుబుజ్జిలి: మూగబాలికపై కుక్కలు దాడి చేయడంతో తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఫకీర్‌సాహెబ్‌పేట గ్రామానికి చెందిన బలగ ఇందు అనే 8వ తరగతి చదువుతున్న బాలిక ఆరు బయట ఉండగా.. కుక్కలు దాడి చేయడంతో శనివారం గాయపడింది. వెంటనే బాలికను జొన్నవలస ఏరియా ఆస్పత్రికి తరలించారు. మొత్తం 12 చోట్ల గాయాలైనట్లు తండ్రి జగదీష్ తెలిపారు.

సెంచూరియన్‌లో ఫ్రెషర్స్ ఫెస్టివల్



మాట్లాడుతున్న రాజేష్ పాడి, వేదికపై మహాపాత్రో, ధీరజ్‌లు



మిస్టర్, మిస్ ఫ్రెషర్స్‌గా ఎంపికైన విద్యార్థులు

రాయగడ: స్థానిక పితామహల్‌లోని సెంచూరియన్ యూనివర్సిటీలో 11వ తరగతిలో చేరిన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఫ్రెషర్స్ పార్టీ శనివారం నిర్వహించారు. దీనిలో భాగంగా నూతనంగా చేరిన విద్యార్థుల మధ్య నిర్వహించిన వివిధ పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వర్సిటీ చైర్మన్ డాక్టర్ రాజేష్‌పాడీ మాట్లాడుతూ.. విద్యార్థులకు పోటీతత్వం అవసరమని పేర్కొన్నారు. ఏకాగ్రతతో చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల నృత్యాలు, గీతాలాపనలు ఉర్రూతలూగించాయి. కార్యక్రమంలో వర్సిటీ అధ్యక్షుడు రాధాకృష్ణ మహాపాత్రో, ఉపాధ్యక్షుడు ధీరజ్ మహంతి తదితరులు పాల్గొన్నారు.

'సాంకేతికతతో మరింత అభివృద్ధి'



మాట్లాడుతున్న చంద్రధ్వజ పండ, శర్మ తదితరులు



సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

రాయగడ: విజ్ఞానం, సాంకేతికతతో అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లాలోని గుణుపూర్‌లో ఉన్న గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (జీఐఈటీ) విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్ర ధ్వజ పండ అన్నారు. వర్సిటీ సమావేశ భవనంలో ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అనే అంశంపై శనివారం జరిగిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలు మరింత ముందుకు వెళ్లాలంటే విజ్ఞానం, సాంకేతిక రంగం ఎంతో అవసరమని పేర్కొన్నారు. సాంకేతిక పరంగా అభివృద్ధి చెందితే దేశం ఆర్థిక, సామాజిక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధిస్తుందని ఆకాంక్షించారు. విద్యార్థులు టెక్నికల్ కోర్సుల్లో నైపుణ్యం సంపాదించుకోవాలని సూచించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ (ఒడిశా) చైర్మన్ డాక్టర్ ప్రభాత్ కుమార్ పారి మాట్లాడుతూ టెక్నికల్ ఎడ్యుకేషన్ ప్రాముఖ్యత గురించి వివరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఏవీఎన్ శర్మ మాట్లాడుతూ ఇంటర్నెట్ క్వాంటమ్ కంప్యూటింగ్ ఆవశ్యకతను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు



బియ్యం దుకాణంలో బస్తాలను తూకం వేస్తున్న అధికారులు

జయపురం: పట్టణంలో దైనిక బజారులోని దుకాణాలు, వివిధ పెట్రోల్ బంక్‌లపై కొరాపుట్ జిల్లా తూనికలు, కొలతల అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా డిజిటల్ తూకాలు, సాధారణ తూకాలు పరిశీలించారు. మొత్తం 11 దుకాణాలపై దాడులు జరిపినట్లు వెల్లడించారు. వాటిలో నియమాలు ఉల్లంఘిస్తున్న 6 దుకాణాల యజమానులపై కేసులు నమోదు చేసి వారి నుంచి రూ.13 వేలు జరిమానాలు వసూలు చేసినట్లు తెలిపారు. దాడుల్లో వెయిట్ అండ్ మెజర్స్ డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రోలజీ అధికారి సత్యజిత్ బిశ్వాల్, అసిస్టెంట్ కంట్రోలర్, లీగల్ మెట్రోలజీ అధికారి బిజయ కుమార్ నాయిక్ తదితరులు పాల్గొన్నారు.

త్రిసూలియా తీరంలో మొసలి



తీరంలో సంచరిస్తున్న ఘరియాల్ మొసలి

భువనేశ్వర్: కటక్ జిల్లా కఠజోడి నది త్రిసూలియా తీరంలో శనివారం ఘరియాల్ మొసలి కనిపించింది. ఈ విషయం ప్రచారం కావడంతో త్రిసులియా వంతెనపై భారీ సంఖ్యలో ప్రజలు గుమిగూడారు. దీంతో వంతెనపై వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కమిషనరేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్ జామ్‌ను తొలగించారు. అటవీశాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరి మొసలి ఘూరియల్ జాతికి చెందినదని, మనుషులకు ఎటువంటి హాని కలిగించదని పేర్కొన్నారు. చేపల వేటకు మాత్రమే తీరం చేరిందన్నారు.

క్లుప్తంగా

పారసాంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గ్రామపెద్దలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని పారసాం గ్రామంలో సంగంరెడ్డి జగదీష్ మెమోరియల్ జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు శనివారం నుంచి ప్రారంభమయ్యాయి. సర్పంచ్ నారాయణరావు, ఎంపీటీసీ సభ్యుడు సంగంరెడ్డి జగన్నాథం ఈ పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయి యువజన సంఘ సభ్యులు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు (డే అండ్ నైట్) ఈ పోటీలు కొనసాగుతాయన్నారు. మొదటి నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు నగదు ప్రోత్సాహకాలతో పాటు మెమెంటోలను అందజేస్తామని తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి 45 టీమ్‌లు పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

చింతలవలసలో దొంగల హల్‌చల్

డెంకాడ: మండలంలోని చింతలవలస గ్రామంలో దొంగలు హల్‌చల్ చేశారు. రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. బాధితుల కుటుంబ సభ్యులు, పోలీసుల అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. చింతలవలస ఐదో ఏపీఎస్పీ బెటాలియన్‌లో ఆర్‌ఎస్సైగా పనిచేస్తున్న లింగాల యర్రయ్య చింతలవలస గ్రామంలో రెండు అంతస్తుల సొంత ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నారు. పైభాగంలో యర్రయ్య కుటుంబం ఉండగా.. కింద అంతస్తులో ఇదే బెటాలియన్‌లో ఆర్‌ఎస్సైగా పనిచేస్తున్న అనపర్తి బంగార్రాజు కుటుంబం నివాసం ఉంటోంది. ఈ రెండు కుటుంబాలు కలిసి గత నెల 28వ తేదీన తీర్థయాత్రలకు వెళ్లారు. అయితే ఈనెల 2వ తేదీన సాయంత్రం మొక్కలకు నీళ్లు పోసేందుకు వచ్చిన పని మనిషి ఇంటి తాళం, ప్రధాన ద్వారం తెరిచి ఉండడాన్ని గమనించి ఇంటి యజమాని ఫోన్ చేసి పరిస్థితిని వివరించింది. దీంతో ఇంటి యజమానికి ఎర్రయ్య నెల్లిమర్లలో ఉంటున్న అల్లుడు పోతన రాఘవకు ఫోన్ చేసి చింతలవలసలోని ఇంటికి వెళ్లాలని సూచించాడు. వెంటనే రాఘవ చింతలవలస వెళ్లి ఇంటిని పరిశీలించి, దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. యర్రయ్య ఇంటిలో ఉన్న 2 తులాల బంగారంతో పాటు రూ.20 వేల నగదు.. బంగార్రాజు ఇంటిలో పావుతులం చెవి దిద్దులు పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘాట్‌రోడ్డుపై స్తంభించిన ట్రాఫిక్



నిలిచిపోయిన వాహనాలు

సాలూరు: పాచిపెంట మండలంలోని పి.కోనవలస వద్ద ఆంధ్రా – ఒడిశా ఘాట్ రోడ్డుపై శనివారం ఉదయం ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆంధ్రా నుంచి ఒడిశా వైపు వెళ్తున్న లారీకి టైర్ పంక్చర్ కావడంతో రోడ్డుకడ్డంగా నిలిచిపోయింది. దీంతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. గంటల కొద్దీ వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ



పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

పాచిపెంట: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గంజాయి, సారా రవాణాపై దృష్టి సారించాలన్నారు. ఎస్పీ వెంట సాలూరు పట్టణ, రూరల్ సీఐలు వాసు నాయుడు, బాలకృష్ణ, ఎస్సై నారాయణరావు, తదితరులున్నారు.

6న ఐఐటీ శిక్షణకు విద్యార్థుల ఎంపిక

సీతంపేట: ఐఐటీ సూపర్ 60 బ్యాచ్ శిక్షణ ఇవ్వడానికి గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 6న ఎంపిక పరీక్ష నిర్వహించనున్నట్టు ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, కోర్సు డైరెక్టర్ మురళీబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేటలో జూనియర్ కళాశాలలతో పాటు, ఇతర జూనియర్ కళాశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీవోఈ మల్లి, ఏపీ ఆర్ బాలురు, బాలికల కళాశాలలు, పెద్దమడి గురుకుల కళాశాలలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. వివరాలకు 82476 08256 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

‘ఏటీఎల్ మారథాన్’ పోటీల్లో..
సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

- జాతీయ స్థాయి టాప్ 500 ప్రాజెక్ట్‌ల్లో జిల్లాకి చెందినవి 5 ఎంపిక



ప్రాజెక్ట్‌లను పరిశీలిస్తున్న డీఈఓ ఎన్.ప్రేమ్‌కుమార్



కొత్తవలస ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రాజెక్ట్ ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజయనగరం అర్బన్: అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు (ఏటీఎల్) ఉన్న స్కూళ్లకు సంబంధించి ‘ఏటీఎల్ మారథాన్ 2023 – 24’ పేరుతో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి ఆన్‌లైన్ వైజ్ఞానిక ప్రదర్శన పోటీల్లో జిల్లాకు చెందిన ఐదు స్కూళ్ల ప్రాజెక్ట్‌లు టాప్ 500 టీమ్ ఇడియాలో ఎంపికయ్యాయి. ఈ మేరకు జాతీయ స్థాయి ఎంపిక కమిటీ శనివారం ఒక ప్రకటన విడుదల చేసిందని జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ మిరియాల కృష్ణారావు తెలిపారు. ఈ పోటీలకు జిల్లాలో ఉన్న 42 ఏటీఎల్ స్కూళ్ల నుంచి 210 ప్రాజెక్ట్‌లు వెళ్లాయి. జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రం నుంచి 35 ప్రాజెక్ట్‌లు ఎంపిక కాగా అందులో జిల్లా నుంచి ఐదు ఉండడం అభినందనీయమన్నారు. ఈ మేరకు ప్రాజెక్ట్‌లను రూపొందించిన విద్యార్థులను డీఈఓ ఎన్. ప్రేమ్‌కుమార్ అభినందించారు.

ఎంపికైన ప్రాజెక్ట్‌లు, స్కూల్, విద్యార్థుల వివరాలు

ప్రాజెక్ట్ పేరు	స్కూల్ పేరు	విద్యార్థుల పేర్లు
అడ్డంకిని తప్పించే యంత్రం	ఏపీమోడల్ స్కూల్, కొత్తవలస	భాను సాయి, జతిన్
సమగ్ర నీటి నాణ్యత పర్యవేక్షణ వ్యవస్థ	ఫోర్ట్ సిటీ స్కూల్, విజయనగరం	ఎం.నిఖిల్, డి.కార్తికేయ,ప్రణయ్ కౌశిక్
స్మార్ట్ ట్రాలీ	ఏపీమోడల్ స్కూల్, భోగాపురం	జి.వర్షిత, యశస్విని, జి. అక్షయ
ఎడ్జ్ డిటెక్షన్ రోబోట్	జెడ్పీహెచ్‌ఎస్, రామభద్రపురం	కె.గౌతమ్, శ్యామ్‌సాయి
మొబైల్‌తో నియంత్రించే రోబో	చేయి జెడ్పీహెచ్‌ఎస్, దెందేరు	జె.పూజ, పి.గోపి, జి.బాలు నరసింహ

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు ప్రారంభం

- అండర్ – 7 విభాగంలో పాల్గొన్న 200 మంది క్రీడాకారులు
- పోటీలను ప్రారంభించిన డీఎస్‌డీఓ వెంకటేశ్వరరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి వెంకటేశ్వరరావు



రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం : మనలో దాగి ఉన్న మేధాసంపత్తిని వెలికితీయడంలో కీలకమైన క్రీడగా పేరుగాంచిన చెస్ పోటీలకు విజయనగరం జిల్లా వేదికగా నిలిచింది. చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న పోటీలు శనివారం నగరంలోని గురజాడ పాఠశాలలో ప్రారంభమయ్యాయి. అండర్-7 విభాగంలో బాల, బాలికలకు నిర్వహించిన పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు, చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం కార్యదర్శి కేవీ.జ్వాలముఖి ప్రారంభించారు. ఉత్కంఠభరితంగా సాగిన మొదటి రోజు పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఆదివారం జరగనున్న రెండో రౌండ్‌లో తలపడతారని నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్ విజేతలను త్వరలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. ఇదిలా ఉండగా పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. చిన్నారుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికి తీసేందుకు క్రీడలు చక్కని వేదికన్నారు. చెస్‌లో రాణించే వారు అటు విద్య, ఇటు క్రీడల్లో కూడా రాణిస్తారని చెప్పారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన తప్పనిసరి

- జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ

పార్వతీపురం టౌన్: అవయవదానంపై అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి అల్లు సత్యనారాయణ అన్నారు. భారతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక భాస్కర డిగ్రీ, ఇంటర్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మనిషి తన శరీరంలో పలు అవయవాలు, కణజాలాన్ని దానం చేయవచ్చన్నారు. కళ్లు, గుండె, కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులు, పెద్ద ప్రేగు చిన్నప్రేగు, ఎముకలు, ఎముక మజ్జ దానం చేయవచ్చనన్నారు. అవయవదానం వల్ల ఒక మనిషి తన మరణం తర్వాత ఆరేడుగురికి కొత్త జీవితం ఇవ్వవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం. నాయుడు, లీగల్ కంప్రొఫెషన్ ఆఫీసర్ పారిశెర్ల శ్రీధర్, కౌన్సిలర్ ఎ.తవిటినాయుడు, ఔట్రీచ్ వర్కర్ అనిల్, భాస్కర కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సీతంపేట: టెట్, డీఎస్సీ ఉచిత శిక్షణకు గిరిజన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని వీరఘట్టం, పాలకొండ, సీతంపేట, భామిని మండలాలు.. శ్రీకాకుళం జిల్లాలోని అన్ని మండలాల గిరిజన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు స్టడీ మెటీరియల్ అందజేస్తామన్నారు. ఈనెల 11 లోగా స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో టెట్ అర్హత పరీక్ష, కులధ్రువీకరణ, విద్యార్హత సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 89784 55324, 99493 96527 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆంధ్ర రిజర్వాయర్ నీరు విడుదల



నీటిని విడుదల చేస్తున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ: ఆంధ్ర రిజర్వాయర్ కాలువ గేట్లు ఎత్తి ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన నీటిని స్త్రీ శిశు సంక్షేమశాఖ, గిరిజన శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, రైతులు సాగునీటిని సద్వినియోగం చేసుకుని పంటలు బాగా పండించుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఈఈ సీతారాంనాయుడు మాట్లాడుతూ, ఇక్కడ పనిచేసిన ఉద్యోగులందరూ ఉద్యోగ విరమణ చేయడంతో పది మంది ఉద్యోగులను కేటాయించాలని మంత్రిని కోరారు. జైకా నిధులతో వివిధ పనులు చేపట్టామని చెప్పగా... ఎక్కడెక్కడ ఏ పనులు చేశారో చెప్పాలని విలేకరులు కోరారు. అలాగే పనుల నిర్వహణలో పలు ఆరోపణలున్నాయని విలేకరులు తెలియజేయగా.. మంత్రి కలుగజేసుకుని డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ చేసి, బాధ్యులను శిక్షిస్తామన్నారు. ఉద్యోగుల విషయమై సంబంధిత మంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా లోతుగెడ్డ నుంచి ఏఎస్‌ఆర్ జిల్లా గరుగుబిల్లి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని కొంతమంది గిరిజనులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు పి. నర్సయ్యమ్మ, మండల టీడీపీ, జనసేన నాయకులు సీహెచ్ వెంకటరావు, జి. అన్నవరం, ఎస్. రాజశేఖర్, పి. గంగునాయుడు, ఎస్. కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

7న నెల్లిమర్లలో జాతీయ చేనేత దినోత్సవం

విజయనగరం అర్బన్: జాతీయ చేనేత దినోత్సవాన్ని ఈ నెల 7వ తేదీన నెల్లిమర్లలోని శాలివీధిలో ఘనంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు విజయనగరం జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం ప్రకటించింది. స్థానిక శ్రీపంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలో శనివారం సంఘం ప్రతినిధులు నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆర్థికంగా వెనుకబడిన చేనేత కార్మికులకు ఆర్థిక సహాయంతో పాటు వృత్తిపై వారు చూపుతున్న నైపుణ్యతకు ఘన సత్కారం చేపడతామని తీర్మానించామని తెలిపారు. ఆ రోజు జరిగే ఈ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు చేనేత కులస్తుల హాజరు కావాలని కోరారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు గిడుతూరి రాము, జిల్లా యువజన అధ్యక్షుడు సప్పా ప్రసాద్, గౌరవ అధ్యక్షుడు జి.పైడితల్లి, ఉపాధ్యక్షుడు కె.బలరాం, కోశాధికారి కె.చిరంజీవి, అప్పలరాజు, త్రినాధ్, ప్రసాద్, సూర్యనారాయణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత

- ఎస్పీ వకుల్ జిందల్



మృతుని భార్యకు చెక్ అందజేస్తున్న ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీస్‌శాఖలో పనిచేసి ఇటీవలి కాలంలో మృతిచెందిన కానిస్టేబుల్, హోంగార్డ్ కుటుంబాలకు ఎస్పీ వకుల్ జిందల్ చేయూతనందించారు. సిబ్బంది పోగుచేసిన ఒకరోజు అలవెన్స్‌ను మృతుల కుటుంబాలకు జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో పనిచేస్తూ మృతి చెందిన వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో సిబ్బంది స్వచ్ఛందంగా నగదు పోగుచేసి అందజేయడం అభినందనీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వల్ల పోలీస్ ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతో పాటు వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందన్నారు. ఇటీవల మృతిచెందిన హోమ్‌గార్డు జి. వెంకటసత్యం, కానిస్టేబుల్ పి. గౌరీకుమార్ కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. వెంకటసత్యం భార్య జి. పార్వతికి రూ. 3.36 లక్షలు, గౌరీకుమార్ భార్య ఇందిరావసంతికి రూ.1.48 లక్షల చెక్‌లు అందించారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం హోమ్‌గార్డ్స్ ఉద్యోగుల పిల్లలకు మంజూరు చేసిన మెరిట్ స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఆఫీస్ సూపరింటెండెంట్ ఏఎస్‌వీ ప్రభాకరరావు, ఆర్ఐ ఆర్.రమేష్‌కుమార్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బోధనేతర పనులు తప్పించాలి



మాట్లాడుతున్న సంఘ జిల్లా అధ్యక్షుడు జోగారావు

విజయనగరం అర్బన్: ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కల్పించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శనివారం స్థానిక అమర్‌భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఈ మేరకు పలు తీర్మానాలు చేశారు. బోధనా సమయన్ని వృథా చేసే బోధనేతర పనులు అప్పగించడం సరికాదన్నారు. సంఘ జిల్లా అధ్యక్షుడు కె.జోగారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పాడు సూరిబాబు, జిల్లా కార్యదర్శి ఎ.మోహనరావు, వి.గోవిందరావు, పి.రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

చినకుదమలో ఏనుగుల గుంపు

జియ్యమ్మవలస: మండలంలోని చినకుదమ పంట పొలాలలో ఏనుగులు శనివారం దర్శనమిచ్చాయి. అరటి, పామాయిల్ తోటలతో పాటు వరి నారుమళ్లు ఉండడంతో ఏనుగులు ఇక ఇక్కడే ఉంటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. నాగావళి నది కాలువ చినకుదమ పక్కనే ఉండడంతో మధ్యాహ్న సమయాన అక్కడికి వెళ్తూ రాత్రి సమయాన గ్రామాలలోకి చొచ్చుకు వచ్చే ప్రమాదం ఉందని రైతులు భయాందోళనలు చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఆర్టీసీ ఉద్యోగులు



జాతీయ పోటీలకు ఎంపికైన ఉద్యోగులు రమేష్, సురేష్

శృంగవరపుకోట: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆఫీసర్ల కేటగిరీలో 1000 మీటర్ల ఫాస్ట్ వాకింగ్‌లో డిపో మేనేజర్ కె.రమేష్.. జావెలిన్ త్రో విభాగంలో జి.సురేష్‌కుమార్ ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతో వీరిద్దరూ సెప్టెంబర్ 19, 20, 21 తేదీల్లో విశాఖలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు.

మంత్రిని కలిసిన అధికారులు



మంత్రి సంధ్యారాణికి మొక్క అందజేస్తున్న ఎస్పీ మాధవరెడ్డి



మంత్రిని సంధ్యారాణితో ఐటీడీఏ పీఓ సేధు మాధవన్

సాలూరు: రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణిను ఎస్పీ మాధవరెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి స్వగృహంలో ఆమెను కలిసి గంజాయి నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ, తదితర అంశాలపై చర్చించారు. అలాగే ఐటీడీఏ పీఓగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సేధు మాధవన్ కూడా మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గిరిజనాభివృద్ధి, తదితర అంశాలపై చర్చించారు.

రామతీర్థంలో వైభవంగా పునర్వసు పట్టాభిషేకం

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో పునర్వసు పట్టాభిషేక మహోత్సవాన్ని ఆలయ అర్చకులు శనివారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున స్వామికి ప్రాతః కాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో సుందరాకాండ హవనం జరిపించారు. అనంతరం వెండి మండపం వద్ద స్వామి వారి నిత్యకల్యాణ మహోత్సవాన్ని వేడుకగా జరిపించి...పునర్వసు నక్షత్రం సందర్భంగా శ్రీమద్రామాయణ పారాయణం నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు రామాయణంలో పట్టాభిషేక సర్గ విన్పించి శ్రీరామచంద్రమూర్తికి పంచామృతాలతో విశేష అభిషేకాలు జరిపించారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ వై.శ్రీనివాసరావు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భౌ..భౌ...



- భయపెడుతున్న గ్రామ సింహాలు
- నిత్యం కుక్కకాటుకు గురవుతున్న జనం
- 2023లో 17,538 మంది బాధితులు
- 2024లో జనవరి నుంచి జూన్ వరకు 9531 మందికి కుక్కకాటు

విజయనగరం ఫోర్ట్:

శునకాలు (గ్రామ సింహాలు) జనాన్ని భయపెడుతున్నాయి. జిల్లాలో ఎక్కడో ఓ చోట జనం రోజూ కుక్కకాటుకు గురవుతున్నారు. ఏ వైపు నుంచి ఏ కుక్క కాటేస్తుందోనని జనం హడలిపోతున్నారు. గ్రామాల్లోను, పట్టణాల్లోను అదే పరిస్థితి. ఏటా వేలాది మంది కుక్క కాటుకు గురవుతున్నారు. పట్టణాల్లోను, గ్రామాల్లోను శునకాలు అధిక సంఖ్యలో సంచరిస్తూ భయపెడుతున్నాయి. కుక్కల బారిన పడి వేలాది మంది తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో 3 లక్షలకు పైగా శునకాలు ఉన్నాయి. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వీధుల్లో సంచరిస్తూ జనాలపై దాడి చేస్తున్నాయి. జనంతో పాటు పశువులు, కోళ్లపై కూడా శునకాలు దాడికి పాల్పడుతున్నాయి. కుక్కలు కరవడం వల్ల జిల్లాలో ఆవు, గేదె దూడలు, మేకలు, గొర్రెలు, కోళ్లు చనిపోతున్నాయి.

హడల్..

జిల్లాలో నిత్యం పదుల సంఖ్యలో జనం కుక్కకాటుకు గురవుతున్నారు. పిల్లలు, పెద్దలు అనే తేడా లేకుండా శునకాల బారిన పడుతున్నారు. జిల్లాలో ఉన్న పీహెచ్‌సీలకు, సీహెచ్‌సీలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి నిత్యం కుక్క కాటు బాధితులు రేబిస్ వ్యాక్సిన్ కోసం వస్తున్నారు.

2023లో 17,538 మందికి కుక్క కాటు

జిల్లాలో 2023 జనవరి నెల నుంచి డిసెంబర్ వరకు 17,538 మంది కుక్క కాటుకు గురయ్యారు. 2024 జనవరి నెల నుంచి జూన్ నెలఖారు నాటికి 9531 మంది కుక్క కాటుకు గురయ్యారు. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి పరిధిలో ఈ కేసులు నమోదు అయ్యాయి.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పతివాడ రవితేజ. ఇతనిది డెంకాడ మండలం చింతలవలస గ్రామం. ఇతన్ని గ్రామంలో కుక్క కరిచింది. కన్ను కింద భాగాన కుక్క కరిచింది. దీంతో అతను చికిత్స కోసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చాడు.

గంట్యాడ మండలం పెదవేమలి గ్రామంలో కొద్ది రోజులు క్రితం ఒకే రోజు రంధి సత్యం, వి.పద్మలను కుక్క కరిచింది. వారు కూడా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు.

2024 జనవరి నుంచి జూన్ నెలఖారు నాటికి నమోదైన కేసులు

నెల	నమోదైన కేసులు
జనవరి	1970
ఫిబ్రవరి	1744
మార్చి	1671
ఏప్రిల్	1540
మే	1414
జూన్	8339



కుక్కలు

రేబిస్ వ్యాధి లక్షణాలు

కుక్కకాటు పట్ల నిర్లక్ష్యం పనికిరాదు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలు గాల్లో కలిసిపోయినట్టే. కుక్కకాటు పట్ల నిర్లక్ష్యం చేస్తే రేబిస్ వ్యాధి సోకే అవకాశం ఉంది. కుక్క కరిచిన తర్వాత వ్యాక్సిన్ వేసుకోకపోతే సాధారణ కుక్క అయితే 20 నుంచి 90 రోజుల్లో రేబిస్ వ్యాధి సోకుతుంది. పిచ్చికుక్క అయితే 2నుంచి 7 రోజుల్లో రేబిస్ వ్యాధి సోకుతుంది. రేబిస్ వ్యాధి సోకితే ప్రాణాలు కాపాడడం సాధ్యం కాదు. రేబిస్ వ్యాధి సోకిన వ్యక్తికి తిమర్లు రావడం, ఆందోళన చెందడం, నీరు చూస్తే భయపడడం(హైడ్రోఫోబియా) గతానికి భిన్నంగా ప్రవర్తించడం, కాళ్లు, చేతులకు పక్షవాతం రావడం జరుగుతుంది.



కుక్క కరిచిన వెంటనే ఆ ప్రదేశాన్ని సబ్బుతో శుభ్రంగా కడగాలి. వీలైనంత త్వరగా వైద్యున్ని సంప్రదించాలి. సాధారణ కుక్క అయితే రేబిస్ వ్యాక్సిన్ వేస్తే సరిపోతుంది. అదేవిధంగా ముఖానికి దగ్గరగాగాని, చేతిపైగాని కరిస్తే మొదడు వాపు వ్యాధి వచ్చే అవకాశం ఉంది. ఇటువంటి వారికి రేబిస్ ఇమినోగ్లోబిన్ ఎక్కించాల్సి ఉంటుంది. పిచ్చికుక్క కరిచిన వారికి కూడా ఇమినోగ్లోబిన్ ఎక్కించాలి. కుక్క మంచిదైనా, పిచ్చిదైనా కరిచిన తర్వాత నిర్లక్ష్యం చేయకూడదు.

– డాక్టర్ బోశెం పద్మావతి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి